జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 8 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 6



# ఇల్లెందులో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యం
- ఇద్దరు వార్డెన్ల సస్పెన్షన్‌కు జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశం
- ప్రభుత్వ వైద్యశాలను పరిశీలించిన కలెక్టర్



**ఇల్లెందు, ఏప్రిల్ 7, ప్రజాజ్యోతి:** ఇల్లందు పట్టణంలో జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం సాయంత్రం విస్తృతంగా పర్యటిస్తూ ప్రభుత్వ ఆసుపత్రి, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు, వివిధ వసతి గృహాలను

మిగతా 2 లో...





2 లో..

# బీసీ అయితే....
# ఢీ అంటే ఢీ...

- హోరెత్తనున్న జడ్పీటీసీ పోరు
- కాంగ్రెస్‌లో కయ్యాలు తప్పవా..?
- భద్రాచలం సీటుపై రచ్చ రచ్చ
- టికెట్ కోసం పోటాపోటీ లాబీయింగ్

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల శంఖం మోగకముందే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం జడ్పీటీసీ స్థానం రాజకీయంగా వేడెక్కుతోంది. ముఖ్యంగా సీటు బీసీ జనరల్‌గా ఖరారైతే పోటీ "ఢీ అంటే ఢీ"గా మారుతుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే ఆశావాహులు భారీగా రంగంలోకి దిగడంతో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరుతున్నాయి.

● భద్రాచలం, ప్రజాజ్యోతి



# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

- ఆహార పరిశీలనలో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలి
- ప్రభుత్వఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సమయానికి వైద్య సహాయం అందించాలి
- ప్రభుత్వం అందించే నిధులకు అనుగుణంగా రోగులకు ఆహారం అందడం లేదు
- రోగులకు అందించే ఆహారంపై అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి... అంకిత్...భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్

**అశ్వారావుపేట, ఏప్రిల్ 07, ప్రజాజ్యోతి :** విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని, వారికి వడ్డించే ఆహారాన్ని పూర్తిగా పరిశీలించిన తర్వాతే అందించాలని 8, 9, 10వ తరగతుల విద్యార్థులను ఆహార పరిశీలనలో భాగస్వామ్యం

మిగతా 2 లో...

# ఉత్తమ వైద్య సేవలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

- భద్రాద్రి కొత్తగూడెం టీవీవీపీ ఆసుపత్రులకు అత్యధిక అవార్డులు



6 లో...



# సభను నీరుగార్చింది ఆ ఇద్దరే..!?

- కన్వీనర్ బాధ్యతల్లో జోక్యం... సభలో గందరగోళం
- మహనీయుడి కార్యక్రమాన్ని బుగ్గిపాలు చేశారంటూ దళిత వర్గాల ఆగ్రహం
- తప్పు అని ప్రశ్నించిన వారిపై దురుసు ప్రవర్తన
- ఎస్సి ఎస్టీ కేసులు నమోదు చేపిస్తాం లేకుంటే దాడులకు పాల్పడతాం అంటూ బెదిరింపులు
- మినీ బ్యాంక్ నిర్వాహకుడి నోటి దురుసుపై తీవ్ర విమర్శలు

**కొత్తగూడెం, ఏప్రిల్ 7 ( ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెంలో ప్రభుత్వ శాఖ ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహనీయుడి జయంతి కార్యక్రమం అనవసర జోక్యాలతో గందరగోళంగా మారిందని పలువురు దళిత సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహనీయుడి కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాల్సిన సమయంలో సభను ఉద్దేశించి మాట్లాడటం తెలియని ఇద్దరు వ్యక్తులు అనవసరంగా వ్యవహరించి సభను నీరుగార్చారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మినీ బ్యాంక్ నిర్వహిస్తున్న వ్యక్తి కన్వీనర్ బాధ్యతల్లో తలదూర్చి తనకే అన్నీ తెలుసు అన్నట్లుగా వ్యవహరించడంతో కార్యక్రమం

మిగతా 6 లో...

## ఇల్లెందులో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు





(మొదటి పేజీ తరువాయి...)

ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలు, విద్యార్థుల సంక్షేమం, ఆహార నాణ్యత, పరిశుభ్రత, మౌలిక వసతులపై సమగ్రంగా పరిశీలించి లోపాలు గమనించిన చోట్ల కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొదటగా ఇల్లందు వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్, ఆసుపత్రి నిర్వహణ, వైద్య సేవలు, మౌలిక సదుపాయాలపై సమగ్రంగా పరిశీలించారు. ఆసుపత్రి ఎదుట ప్రైవేట్ అంబులెన్స్ నిలిపి ఉంచడం గమనించి దాని అవసరం, అనుమతులపై అధికారులను ప్రశ్నించారు. ఆసుపత్రి ఆవరణలో ప్రైవేట్ కార్యకలాపాలు నిర్వహించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ తగిన వివరణ ఇవ్వాలని ఆర్ఎంఓను ఆదేశించారు. ఇన్‌పేషెంట్ విభాగాన్ని పరిశీలించి రోగులతో మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. డయాలసిస్ కేంద్రాన్ని తనిఖీ చేసి కేసుల సంఖ్య, సేవల నాణ్యతపై ఆరా తీశారు. ఈ ప్రాంతంలో డయాలసిస్ కేసులు అధికంగా నమోదవుతున్న కారణాలను అధ్యయనం చేయాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది హాజరు నమోదు పుస్తకాలను పరిశీలించి విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. ఆసుపత్రికి అవసరమైన అంబులెన్స్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఒక బాధితుడు అందజేసిన వినతి పత్రంపై స్పందించిన కలెక్టర్ అత్యవసర సమయంలో ప్రైవేట్ అంబులెన్స్ మాట్లాడుకున్నప్పటికీ అధిక డబ్బుల ఆశతో నిర్లక్ష్యం వహించడం వల్ల రోగి మరణించిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబులెన్స్ సేవల్లో నిర్లక్ష్యం జరిగిందని భావిస్తూ సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఆదేశించారు. అత్యవసర సేవల్లో ఎటువంటి లోపాలు సహించబోమని స్పష్టం చేశారు. అనంతరం ఇల్లందు ట్రైబల్ వెల్ఫేర్ ఎస్టీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసి వంటశాలలో సిద్ధం చేస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం విభిన్న వంటకాలు అందించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ విద్యార్థుల పోషణలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించి సరుకుల నాణ్యత, నిల్వ విధానాలపై అధికారులకు సూచనలు చేశారు. విద్యార్థులతో ముచ్చటించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని భవనం మరమ్మతులు, ఫ్యాన్లు, తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సదుపాయాలు, భోజన నాణ్యత, బోధనపై వివరాలు తెలుసుకున్నారు. భోజనం సమయానికి సంబంధించి సిబ్బంది సరైన సమాచారం ఇవ్వకపోవడం, మెనూ పాటించకపోవడం, పరిశుభ్రత లోపాలు గమనించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం క్షమించబోమని స్పష్టం చేస్తూ, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన వార్డెన్ భరత్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆదేశించారు.

ఇల్లందు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహాన్ని పరిశీలించిన కలెక్టర్‌కు విద్యార్థులు, వార్డెన్, సిబ్బంది ఎవరు లేకపోవడం గమనించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వసతి గృహ నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించడంతో సంబంధిత వార్డెన్ నరేష్ పై కఠిన చర్యలు తీసుకోని వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశించారు. వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ నిర్ణీత సమయానికి భోజనం సిద్ధం కాకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది విధుల్లో లోపాలు గమనించి వార్డెన్‌ను హెచ్చరించారు. విద్యార్థులకు సమయానికి నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడం తప్పనిసరి బాధ్యత అని స్పష్టం చేశారు. వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన ఇద్దరు వార్డెన్లను సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశిస్తూ విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం, భద్రత విషయాల్లో అధికారులు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. విద్య, వైద్యం మరియు సంక్షేమ రంగాల్లో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్. జి హర్షవర్ధన్, ఆర్ఎంఓ రామ్ నివాస్, డాక్టర్ ప్రత్యూష, వసతి గృహాల వార్డెన్లు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీ అయితే ఢీ అంటే ఢీ...

**భద్రాచలం, ఏప్రిల్ 7 (ప్రజా జ్యోతి):** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల శంఖం మోగకముందే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం జడ్పీటీసీ స్థానం రాజకీయంగా వేడెక్కుతోంది. ముఖ్యంగా సీటు బీసీ జనరల్‌గా ఖరారైతే పోటీ "ఢీ అంటే ఢీ"గా మారుతుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే ఆశావాహులు భారీగా రంగంలోకి దిగడంతో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరుతున్నాయి. మొదట్నుండి పార్టీకి విధేయుడిగా పేరున్న సీనియర్ నేత బుడగం శ్రీనివాస్ టికెట్ కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పరిచయాలను వినియోగిస్తూ తన అవకాశాలను బలపరుచుకునే ప్రయత్నంలో ఉన్నారు. వలస పార్టీల నుంచి వచ్చిన వారికి టికెట్ ఇస్తే కార్యకర్తలు ఒప్పుకోరని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, బుడగం శ్రీనివాస్‌కు ఎంపీ బాలరాం నాయక్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి మద్దతు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఆయన అభ్యర్థిత్వం బలంగా నిలుస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక మరోవైపు గతంలో బీఆర్ఎస్‌లో పనిచేసి ఎమ్మెల్యే తెల్లం వెంకటరావుతో సన్నిహితంగా ఉన్న నక్క ప్రసాద్ కూడా టికెట్ రేసులో ఉన్నారు. ఆయనకు కాంగ్రెస్‌తో సంబంధం లేదని స్థానిక నాయకులు వ్యతిరేకిస్తున్నప్పటికీ, ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు హామీ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి అభిప్రాయానికి విరుద్ధంగా ఎమ్మెల్యే తెల్లం నక్క ప్రసాద్‌కు మద్దతు ఇస్తారా అన్నది పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. ఇదే సమయంలో మాజీ ఎమ్మెల్యే సతీష్ పాల్ రాజ్ కుమారుడు, క్రాంతి విద్యాసంస్థల చైర్మన్ సోమరౌతు శ్రీనివాసరావు తన సతీమణి సమత కోసం హైదరాబాద్ స్థాయిలో లాబీయింగ్ ముమ్మరం చేసినట్లు సమాచారం. సీనియర్ నేతలు అడబాల వెంకటేశ్వరరావు, తాళ్లపల్లి రమేష్ గౌడ్ కూడా బీసీ కోటాలో తమకే టికెట్ దక్కుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ పోటీ అంతా రిజర్వేషన్‌పై ఆధారపడి ఉంది.

భద్రాచలం షెడ్యూల్డ్ ఏరియా కావడంతో సీటు ఎవరికి కేటాయిస్తారన్నది కీలకం. బీసీ రిజర్వేషన్ 50 శాతం మించిందన్న కారణంతో హైకోర్టులో కేసు పెండింగ్ లో ఉండటంతో ఎన్నికలపై అనిశ్చితి నెలకొంది. ఒకవేళ సీటు ఎస్టీ లేదా ఎస్సీ వర్గాలకు కేటాయిస్తే ప్రస్తుతం రేసులో ఉన్న బీసీ నేతల ఆశలు నీరుగారే అవకాశం ఉంది. అదే బీసీ జనరల్‌గా ఖరారైతే పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారనుంది. ఎన్నికల షెడ్యూల్ రాకముందే సోషల్ మీడియాలో అభ్యర్థుల ప్రచారం జోరుగా సాగుతోంది. అనధికారిక ఓటింగ్‌లు, మద్దతు పోస్టులు, ప్రచారాలు హోరెత్తుతున్నాయి. అయితే వీటికి అధికారిక ప్రాముఖ్యం లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు మద్దతు ఎవరికి ఉంటుందన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. ఇప్పటికే రిజర్వేషన్ ఖరారు కాకముందే పలువురు తమ అభ్యర్థిత్వాన్ని ప్రకటిస్తూ లాబీయింగ్ ముమ్మరం చేస్తున్నారు.

ఎన్నికల తేదీలు ప్రకటించకముందే ఇంతటి పోటీ నెలకొనడం గమనార్హం. షెడ్యూల్ వెలువడితే అభ్యర్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి, బీసీ రిజర్వేషన్ వస్తే "ఢీ అంటే ఢీ" అన్నట్టుగా భద్రాచలం జడ్పీటీసీ పోరు హోరెత్తడం ఖాయం. ఆశావాహుల అధిక సంఖ్య, అంతర్గత రాజకీయాలు, నాయకుల మధ్య మద్దతు సమీకరణాలు అన్ని కలిసివచ్చి కాంగ్రెస్ పార్టీలో కయ్యాలు తప్పవనే పరిస్థితి కనిపిస్తోంది. టికెట్ కేటాయింపులో అధిష్టానం తీసుకునే నిర్ణయం కీలకంగా మారనుంది.

## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి





(మొదటి పేజీ తరువాయి...)

చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ విస్తృతంగా పర్యటించి పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రి, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తౌలుత మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులకు వడ్డించటానికి సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు డైనింగ్ హాలు, స్టోర్ రూమ్ నిర్వహణ పరిశీలించిన ఆయన ఆహార పదార్థాల సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం మాత్రమే అందించాలని మెనో ప్రకారం పోషకాహారం అందించడంతో పాటు పాఠశాల పరిసరాలలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలన్నారు. అనంతరం 6వ,7వ తరగతి విద్యార్థులతో మాట్లాడిన ఆయన వారికి అందుతున్న సౌకర్యాలు, తదితర విషయాలపై ఆరా తీసి ఆహార నాణ్యత ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసిన కలెక్టర్ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్నారా లేదా అని సిబ్బందిని ప్రశ్నించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆహారం అందించాలని ఆదేశించి, గ్యాస్ సరఫరా, వంటశాల నిర్వహణ పరిశుభ్రతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పలుచోట్ల మెనో పాటించిన పరిస్థితులు తమ దృష్టికి వచ్చాయని అటువంటివి పునరావృతం కాకుండా ఎప్పటికప్పుడు స్థానిక అధికారులు పర్యవేక్షించాలన్నారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్ అవుట్ పేషెంట్ విభాగం, వార్డులు, రక్తపరీక్ష కేంద్రం, మందుల నిల్వ గదులను పరిశీలించి రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని కొరత ఉంటే వెంటనే ఇండెంట్ పెట్టాలని సూచించారు. స్కానింగ్, ఎక్సరే విభాగాలను తనిఖీ చేసిన ఆయన సేవలలో ఆలస్యం జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అందుకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. రేడియాలజీ టెక్నీషియన్ కొరత ఉన్నట్లు తెలుసుకున్న కలెక్టర్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇన్‌పేషెంట్ వార్డులలో రోగులకు అందించే ఆహారాన్ని పరిశీలించి ఆహారం తయారు చేసే ప్రదేశాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ప్రతి రోగికి ఆహారం కోసం ఎంత నిధులు హెచ్చిస్తున్నారని కాంట్రాక్టర్ ని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోగికి 80 రూపాయలు చెల్లిస్తున్నారని కాంట్రాక్టర్ తెలపగా ప్రభుత్వం చెల్లించే నిధులు అనుగుణంగా నాణ్యమైన ఆహారం అందించడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదలకు ఆరోగ్యకరమైన పోషక విలువలతో కూడిన ఆహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రతి రోగికి నాణ్యమైన పరిశుభ్రమైన ఆహారం అందేలా అధికారులు బాధ్యత వహిస్తూ నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ స్థల విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు మౌలిక వసతుల లభ్యత వంటి అంశాలపై స్థానిక అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల నిర్మాణానికి అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తూ పనులను త్వరతిగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కిషోర్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ఎంపీడీవో అప్పారావు, ఆర్ఎంఓ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## మహిళ భద్రతపై అవగాహన సదస్సు

**ములకలపల్లి ఏప్రిల్ 07, ప్రజాజ్యోతి:** మహిళలు, చిన్నారుల భద్రతపై స్థానిక ఎస్సై మదుప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాక్సో చట్టం, బాల్య వివాహాల దుష్పరిణామాలు, మహిళలు మరియు చిన్నారులు ఎదుర్కొనే సమస్యలపై చర్చించారు. మహిళలు, పిల్లలను వేధింపులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మధుప్రసాద్ హెచ్చరించారు. మహిళలు, చిన్నారుల కోసం పనిచేస్తున్న భరోసా సెంటర్ ద్వారా అందుతున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సాయి కళ్యాణ్, భరోసా సిబ్బంది రమాదేవి, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు



# మహిళల భద్రతే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యం

- షీ టీమ్స్, ఏహెచ్‌టీయూ కార్యాలయాల పరిశీలనలో ఎస్పీ రోహిత్ రాజు






**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 7, ప్రజా జ్యోతి:** మహిళల భద్రతకు జిల్లా పోలీసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు స్పష్టం చేశారు. చుంచుపల్లి ప్రాంతంలోని షీ టీమ్స్, ఏహెచ్‌టీయూ కార్యాలయాలను ఆయన మంగళవారం సందర్శించి, అక్కడి పరిస్థితులను సమీక్షించారు.ఈ సందర్భంగా కార్యాలయ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ, సిబ్బందితో మాట్లాడి వారి విధుల నిర్వహణపై ఆరా తీశారు. మహిళలపై లైంగిక వేధింపులు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, బ్లాక్‌మెయలింగ్ వంటి సమస్యలను ఎదుర్కొంటున్నవారు జిల్లా షీటీమ్స్‌ను నేరుగా సంప్రదించాలని సూచించారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టడమే లక్ష్యంగా రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో షీ టీమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, అవసరమైతే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. బాలికలు, మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నిర్భయంగా ముందుకు రావాలని సూచించారు.రద్దీ ప్రాంతాలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, విద్యాసంస్థల పరిసరాల్లో షీ టీమ్స్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ఆకతాయిల ఆగడాలను అరికట్టడంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అలాగే మానవ అక్రమ రవాణా, అవయవాల విక్రయం, బలవంతపు శ్రమ, వ్యభిచారంలోకి దింపడం, బాల్య వివాహాలు వంటి నేరాల నివారణలో ఏహెచ్‌టీయూ సిబ్బంది సమర్థంగా పనిచేయాలని సూచించారు. ఇటువంటి నేరాల నివారణకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మఫ్టీ దుస్తుల్లో సంచరిస్తూ నేరాలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో నిఘా పెంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మణ్, షీ టీమ్స్ ఏఎస్సై నాగయ్య, సిబ్బంది మల్లికాంబ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన నూతన తహసీల్దార్



**ఇల్లందు, ఏప్రిల్ 7, ప్రజాజ్యోతి:** ఇల్లందు నూతన తహసీల్దార్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన సూర్యనారాయణ మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేశారు. మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

## సకాలంలో చెల్లిస్తే ఆస్తి పన్ను రాయితీ

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- బి. నాగరాజు మున్సిపల్ కమిషనర్



అశ్వారావుపేట, ఏప్రిల్ 07, ప్రజాజ్యోతి : మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపుదారులు సకాలంలో పన్ను చెల్లించి రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ బి. నాగరాజు తెలిపారు. మంగళవారం పత్రికలకు విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఎటువంటి బకాయిలు లేకుండా ప్రతి సంవత్సరం ఆస్తి పన్ను చెల్లించుకుంటూ వస్తున్న యజమానులకు 5 శాతం రాయితీని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 2026 –27 ఏప్రిల్ 1వ తేదీ నుండి 30వ తేదీ లోపు చెల్లించిన వారికి ఈ రాయితీ వర్తిస్తుందని ఆన్లైన్ లో కానీ మున్సిపల్ కార్యాలయంలో కానీ చెల్లించి తగు రసీదు పొందగలన్నారు. ఆస్తి పన్ను చెల్లింపు దారులు ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## పినపాక మండలంలో డిపిఓ సుధీర్ కుమార్ ఆకస్మిక పర్యటన



**పినపాక,ఏప్రిల్ 07(ప్రజాజ్యోతి):** పినపాక మండలంలో జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ) సుధీర్ కుమార్ ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని బయ్యారం, భూపాలపట్నం, సీతంపేట గ్రామపంచాయతీలను పరిశీలించారు.గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, గ్రామాభివృద్ధి పనుల పురోగతిపై ఎంపీడీవో వెంకటేశ్వరరావు తో ఆయన సమీక్షించారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో మాట్లాడి ప్రభుత్వ పథకాల అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.గ్రామాల్లో ప్రజలకు అందుతున్న సేవలు మెరుగుపర్చాలని, ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని అధికారులకు సూచించారు. గ్రామాభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు మౌలిక వసతులు అందేలా చర్యలు తీసుకోవాలని డిపిఓ ఆదేశించారు. అనంతరం ఈ బయ్యారం గ్రామపంచాయతీలో ఓ గ్రీవెన్స్ సమస్యపై బాధితులతో మాట్లాడారు. బయ్యారంలో బేకరీ విషయంలో జరిగిన విషయంపైన ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బయ్యారం సర్పంచ్ వాగబోయిన చందర్రావు, భూపాలపట్నం సర్పంచ్ స్వప్న, సీతంపేట సర్పంచ్ శివ శంకర్, ఉప సర్పంచ్ గంగిరెడ్డి సందీప్ రెడ్డి, నిట్ట శిరీష, కార్యదర్శులు సంధ్య, చంద్రకుమార్, షేక్ కాజా హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఏర్పాటు



**చర్ల, ఏప్రిల్ 07:(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలో మంగళవారం భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీమ్ రావ్ అంబేద్కర్ 135వ జయంతిని ఘనంగా జరిపేందుకు దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు భారీగా ఏర్పాటు చేస్తున్నారు. దానిలో భాగంగా అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్లు సమన్వయకర్త కొంగూరు రమణారావు, కమిటీ గౌరవ అధ్యక్షులు దొడ్డా ప్రభుదాస్, కొంగూరు నరసింహారావు,అంబేద్కర్ నిర్మాణ కమిటీ అధ్యక్షులు తడికల లాలయ్య, కార్యదర్శి మచ్చ రామారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అంబేద్కర్ ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా తోటమల్ల రమణమూర్తి, కార్యదర్శిగా బందెల చంటి, ఉపాధ్యక్షులుగా మచ్చ రాజా, ఏడెల్లి గణపతి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కాళ్ళ కృష్ణ, ముసలి సతీష్, కోశాధికారులుగా మచ్చా వీరభద్రం, మోత్కూరి ప్రభాకర్, కమిటీ సభ్యులుగా కనుక భద్రం, నల్లగట్ల నరసింహమూర్తి, తోటమల్ల వరప్రసాద్ అలవాల కృష్ణ, తోటమల్ల విజయ రావు, చెన్నం రామ్మూర్తి, గుడ్దేటి నాగరాజు,బిశ్వాస్ గోపాల్, తడికల నరేష్, పాముల సాంబశివరావు, కారంపూడి సాల్మన్,రూంజా సుమన్, కొంగూరు సత్యనారాయణ,మేడబత్తిని గోవర్ధన్,నిట్ట అబ్బులు, చిట్టిమల్ల మురళి,తడికల బుల్లబ్బాయి,నల్లగట్ల ప్రేమ్ సాగర్, కొంగూరు శ్యామసుందర్, రావులపల్లి చంటి, చింతల భాస్కర్, మచ్చా బుజ్జిబాబు,కూసం సోమరాజు, బోయెల్ల ప్రవీణ్, లను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.ఈనెల 14 మంగళవారం జరగబోవు అంబేద్కర్ జయంతి వేడుకను ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు. జయంతి వేడుక అనంతరం భోజన సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## 21 ఏరియాకు న్యాయం చేసే వరకు కదిలేదే లేదు



**ఇల్లందు, ఏప్రిల్ 7, ప్రజాజ్యోతి:** జెకె 5 ఓసిలో 21 ఏరియా నిర్వాసితులకు సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం న్యాయం చేసే వరకు కదిలేదే లేదని సర్పంచులు, అఖిలపక్ష నాయకులు మంగళవారం ఇల్లందు తహసిల్దార్ కు వినతి పత్రం అందజజేశారు. ఈ సందర్భంగా సర్పంచులు చాందావత్ రమేష్‌బాబు, దనసరి స్రవంతి, అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ విజయలక్ష్మి నగర్, తిలక్ నగర్ గ్రామ పంచాయితీల పరిధిలోని ఓసీ నిర్వాసిత ప్రాంతాన్ని ఖాళీ చేయాలని సింగరేణి అధికారులు ప్రజలకు చెప్పటంతో ప్రజలు భయాందోళనలో బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి యాజమాన్యం ఇలాంటి చర్యలను ఆపాలని కోరారు.సింగరేణి యాజమాన్యం ఎలాంటి సమాచారం, ఎలాంటి నిర్ణయం చేయకుండా ఇల్లు ఖాళీ చేయమని ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం సరైంది కాదన్నారు. ఏదైనా ప్రభుత్వ అనుమతితో పూర్తి స్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని లేని పక్షంలో ఎలాంటి ప్రతిఘటన పోరాటం చేయడానికి సిద్ధంగా ఉంటామని, ప్రజలకు న్యాయం చేసే విధంగా మా కార్యాచరణ ఉంటుందని, తర్వాత జరిగే పరిణామాలకు సింగరేణి సంస్థ బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంపై పూర్తిస్థాయి నివేదిక అందించాలని సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీ నాయకులు, మాజీ ఎంపీటీసీ పూ నెం సురేందర్, అబ్దుల్ నభి, మంచాల వెంకటేశ్వర్లు, తాండ్ర నాగరాజు, క్లింట్ రోచ్, తేజవత్ లాలు, ఎట్టి హరికృష్ణ, వడ్ల శ్రీను, ధనసరి రాజు, బానోత్ హరిసింగ్, గాడేపల్లి భాస్కర్, సదారం చిన్నారి, మొగిలి, రాజు పాల్గొన్నారు.

## మహిళ మృతికి కారణమైన డ్రైవర్ కు జైలు శిక్ష

**కొత్తగూడెం, ఏప్రిల్ 7 ( ప్రజాజ్యోతి )** మహిళ మృతికి కారణమైన కార్ డ్రైవర్ కు కొత్తగూడెం మొదటి అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె. సాయి శ్రీ జైలు శిక్ష విధించారు. కేసు వివరాల ప్రకారం...జూలూరుపాడు మండలం పడమటి నర్సాపురానికి చెందిన నాచబోయిన ప్రశాంత్ 2016 ఏప్రిల్ 22న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 2016 ఏప్రిల్ 21 రాత్రి తన తల్లిదండ్రులు నాచబోయిన వెంకన్న, లలితలు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాల్వంచకు చెందిన నందిగామ పవన్ కుమార్ మహీంద్రా కారును అతివేగంగా అజాగ్రత్తగా నడిపి ఇంటిలోకి దూసుకెళ్లాడు. ఈ ప్రమాదంలో నాచబోయిన లలిత అక్కడికక్కడే మృతి చెందింది. ఇదికాక ముందు మాచినపేటకు చెందిన లాకావత్ సాయికుమార్, బోడా అశోక్ కుమార్ ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్ ను ఢీకొని వారికి తీవ్ర గాయాలు కలిగించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. విచారణలో 14 మంది సాక్షులను కోర్టు పరిశీలించింది. విచారణ అనంతరం నందిగామ పవన్ కుమార్ ను దోషిగా తేల్చి ఒక సంవత్సరం ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్ తరపున ఏ.పీ.పీ బి. విశ్వశాంతి వాదనలు వినిపించగా కోర్టు నోడల్ అధికారి ఎస్సై డి. రాఘవయ్య, కోర్టు పీసీ ఉపేందర్ రావు సహకరించారు.



# భద్రాచలం ఏరియా ఆసుపత్రికి ఐదు రాష్ట్ర స్థాయి పురస్కారాలు

- **'ప్రజా పాలన – ప్రగతి' కార్యక్రమంలో ప్రతిభకు గుర్తింపు**





**భద్రాచలం, ఏప్రిల్ 7, ప్రజా జ్యోతి:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'ప్రజా పాలన – ప్రగతి' కార్యక్రమంలో భాగంగా భద్రాచలం ఏరియా ఆసుపత్రికి ఐదు విభాగాల్లో రాష్ట్ర స్థాయి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి. గిరిజన ప్రాంత ప్రజలకు అందిస్తున్న మెరుగైన వైద్య సేవలకు గుర్తింపుగా ఈ అవార్డులు రావడం ఆసుపత్రి వర్గాల్లో ఆనందాన్ని నింపింది.వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించినందుకు పలువురు వైద్యులు, సిబ్బంది ఈ పురస్కారాలను అందుకున్నారు. శిశు వైద్య సేవల్లో విశేష ప్రతిభ కనబరిచిన డాక్టర్ క్రాపా విజయ్‌కు అవార్డు లభించింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణకు గిరిజనులకు సమర్థవంతమైన వైద్య సేవలు అందించడం, అధిక సంఖ్యలో ప్రయోగశాల పరీక్షలు నిర్వహించడం వంటి అంశాల్లో రెండు విభాగాల్లో పురస్కారాలు దక్కాయి. అత్యధిక ప్రసవాలు నిర్వహించినందుకు మిడ్‌వైఫ్ స్టాఫ్ నర్స్ కృష్ణవేణి, పరిశుభ్రత నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సానిటేషన్ సూపర్వైజర్ వెంకటరావుకు కూడా అవార్డులు లభించాయి.అదేవిధంగా, ఏరియా ఆసుపత్రిలో కాంట్రాక్ట్ వైద్యులుగా పనిచేస్తున్న డాక్టర్ శంషాద్, డాక్టర్ కొండిన్యలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి చేతుల మీదుగా రెగ్యులర్ నియామక పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం మాట్లాడుతూ, ఈ విజయానికి సహకరించిన ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి రవి బాబు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా లభించిన అవార్డుల్లో గణనీయమైన వాటా జిల్లాకు రావడం గర్వకారణమని పేర్కొన్నారు.సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ, తక్కువ సిబ్బంది ఉన్నప్పటికీ అంకితభావంతో పనిచేస్తే మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని ఈ అవార్డులు నిరూపించాయని అన్నారు. భవిష్యత్తులో మరింత ఆధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తున్న వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, పరిశుభ్రత, భద్రతా సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహకారం వల్లే ఈ స్థాయి గుర్తింపు సాధ్యమైందని పేర్కొన్నారు.

## దుర్గమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



**పినపాక,ఏప్రిల్ 07(ప్రజాజ్యోతి):**సీతారాంపురం గ్రామపంచాయతీ సీతారాంపురం గ్రామంలో ఈనెల 12న జరగనున్న దుర్గమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయంను, స్థానిక సర్పంచ్ అనిత, ఆలయ వ్యవస్థాపక అర్చకులు పెద్దా చార్యులు ఆహ్వానించారు. ఎమ్మెల్యే పాయం ను మర్యాదపూర్వకంగా కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు.కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దేవాలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎమ్మెల్యే సహకారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే పాయం కార్యక్రమానికి హాజరై ఆశీర్వదిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ రిపోర్టర్ బృహస్పతి, పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించండి

- **మండల తహశీల్దార్ కి వినతి పత్రం అందజేత**



**చర్ల, ఏప్రిల్ 07:(ప్రజా జ్యోతి ):**చర్ల మండలంలో మంగళవారం నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి తోటపల్లి మాధవరావు ఆధ్వర్యంలో, జిల్లా అధ్యక్షుడు కడియాల సత్యనారాయణ ఆదేశాల మేరకు నాయి బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం కై చర్ల మండల తహసీల్దార్‌కి వినతి పత్రం అందిజేసారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు నాయి బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ్రు హరీష్, మండల కార్యదర్శి సుంకరి రాజేష్, ముక్కాల ఫిలిప్స్, తోటపల్లి సాయి, కొయ్యల గౌరయ్య, తోటపల్లి జయంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు నాయి బ్రాహ్మణుల ఐక్యత మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

## దాతల సహకారంతో అంగన్వాడీ కేంద్రానికి భవనం ఏర్పాటు



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 7 (ప్రజా జ్యోతి):** డల్లాస్ ఎంఎస్ సెరెంగెటీ (టెక్సాస్–యూఎస్ఏ) ఆర్థికసహకారంతో మండల పరిధిలోని రాజీవ్ నగర్ ఆదివాసీ గ్రామంలో నిర్మించిన అంగన్వాడీ కేంద్ర భవనాన్ని ఐసీడీఎస్ సీడీపీవో రేవతి మంగళవారం ప్రారంభించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఖమ్మానికి చెందిన సామాజిక సేవకురాలు, ఉపాధ్యాయురాలు రూప్లా నాయక్ కొంగర పురుషోత్తమరావు, రామచంద్రరావుల దృష్టికి తీసుకువెళ్లగా వారు స్పందించి యూఎస్ఏలో ఉన్న కుటుంబసభ్యుల సహకారంతో రూ.2లక్షలతో నూతన భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని ఐసీడీఎస్ సీడీపీవో రేవతి లాంఛనంగా ప్రారంభించి ఐసీడీఎస్ శాఖకు అధికారికంగా అప్పగించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ ఐజీడీ ప్రమీల, సెక్టార్ సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్థులు, వార్డుసభ్యులు భీమరాజు, భద్రయ్య, దేవయ్య, జోగయ్య, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## వరల్డ్ హెల్త్ డే ర్యాలీ



**చర్ల, ఏప్రిల్ 07:(ప్రజా జ్యోతి ):**చర్ల మండలంలో మంగళవారం వరల్డ్ హెల్త్ డే సందర్భంగా చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొయ్యూరు వైద్య సిబ్బంది,ఆశ కార్యకర్తలు ర్యాలీ చేసి ప్రజల్లో ఆరోగ్య అవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భగా డ్రాక్టర్ హారిక మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యం అని ప్రజలు ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టాలని ముప్పై వయసు దాటిన ప్రతి ఒక్కరు బీపీ,సుగర్ టెస్ట్ లు చేయించుకోవాలని వ్యాయామం రోజుకి కనీసం ఒక అరగంట నడవటం అలవాటు చేసుకుంటే అనేక వ్యాధుల నుండి మనం రక్షణ పొందుతామని మద్యం సేవించటం పొగాకు నమలటం సిగరెట్ త్రాగటం వలన అనేక వ్యాధులు రావటమే కాక అవయవాలు అన్ని పాడైపోయి ఆరోగ్య సమస్యలు వస్తాయని కనుక ఎవరు చెడు అలవాట్లు చేసుకోవద్దని మత్తు పదార్థాల నుండి దూరం గా ఉండాలని తెలియ జేశారు. దోమల వలన బ్యాచ్ మలేరియా, డెంగీ వ్యాధులు ప్రభలకుండ దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని 30 సంవత్సరాలు వయసు దాటిన ప్రతి ఒక్కరు టీ హబ్ ద్వారా చేసే రక్త పరీక్షలు చేయించుకొని మందులు తీసుకోవాలని అన్నిరకాల సాధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయి కనుక ప్రైవేట్ హాస్పిటల్ కు ప్రజలు వెళ్లొద్దని తెలియజేశారు.చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి గోపి ల్యాబ్ టెక్నీషియన్, గంధం విజయలక్ష్మి ఆశా కార్యకర్త ఇరువురికి బెస్ట్ ఎంప్లాయ్ బెస్ట్ ఆశ కార్యకర్త అవార్డు జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ హారిక మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ఈ అవార్డు మన చర్ల కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునకు రావడం సంతోషంగా ఉంది అని ముఖ్యంగా టీ హబ్ టెస్ట్ ల లో మన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జిల్లాలో ముందంజలో ఉందని ఈ సేవ నిమిత్తం బెస్ట్ ల్యాబ్ టెక్నీషియన్ గా అవార్డు తీసుకున్న బి గోపి కి అదే విధముగా ఆరోగ్య సిబ్బంది అభినందించారు.అదే విధముగా గంధం విజయలక్ష్మి ఆశ కార్యకర్త రైస్పేట్ ఏరియా చాలా ఎక్కువ పాపులేషన్ కవర్ చేయటం , గౌట్ డెలివరీ మోటివేషన్,టి బి కేసులు ఫాల్లో అప్ చేయటం , గర్భిణీ స్త్రీల సరైన సమయానికి రిజిస్ట్రేషన్ చేయటం పిల్లలకు టీకాలు సరైన సమయానికి వేసుకునే లా చూసుకోవటం తన వృత్తిలో సురుకుగా పనిచేయటం మొదలగు కారణం తో బెస్ట్ అవార్డ్ పొందిన సందర్భగా డాక్టర్ హారిక వైద్య సిబ్బంది తోటి ఆశ కార్యకర్తలు అభినందనలు తెలియచేసారు.

## ముమ్మరంగా పారిశుధ్య పనులు

- **స్మశాన వాటికలో ప్రత్యేక శుభ్రత చర్యలు**





**దమ్మపేట, ఏప్రిల్ 07, (ప్రజాజ్యోతి ):** దమ్మపేట గ్రామపంచాయతీ పరిధిలో డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త, చెదారం వల్ల మురికి కాల్వల్లో దుర్వాసన వ్యాపిస్తున్నదని గ్రామస్తులు ఫిర్యాదు మేరకు సర్పంచ్, వార్డు సభ్యులు స్పందించి గత రెండు వారాలుగా పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపడుతోంది.ఈ కార్యక్రమంలో భాగంగా మురికి కాల్వలను శుభ్రం చేసి, అందులో పేరుకుపోయిన మట్టిని వెంటనే తొలగిస్తున్నారు. ఇండ్ల ముందు మురుగు నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి కొత్త డ్రైన్లు ఏర్పాటు చేస్తున్నారు. డ్రెయిన్లలో ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి శుభ్రత చర్యలు కొనసాగిస్తున్నారు. అదేవిధంగా ఇంటింటా తిరిగి చెత్తను సేకరించి వాహనాల ద్వారా తరలిస్తున్నారు.ప్రజలు తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని పాలకవర్గ సభ్యులు అవగాహన కల్పించారు.

**స్మశాన వాటికలో శుభ్రత పనులు....**దమ్మపేట గ్రామంలోని హిందూ స్మశాన వాటికలో అధికంగా పెరిగిన పిచ్చి మొక్కలు, కంప చెట్ల వల్ల అక్కడికి వచ్చే ప్రజలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతున్నది. ఈ పరిస్థితిని గుర్తించిన సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం జేసీబీ సహాయంతో స్మశాన వాటిక పరిసరాలను పూర్తిగా శుభ్రపరిచారు.ఈ చర్యలతో స్మశాన వాటికలో సౌకర్యాలు మెరుగుపడటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, గ్రామస్తులు పగడాల రాంబాబు, పంచాయతీ సిబ్బంది కుప్పాల విజయ్, కొప్పర్తి సింగ్, మహాదేవ సాయి, నల్లూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ వైద్యంపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి

- **జిల్లా కలెక్టర్ అంకిత్**






**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 7, ప్రజా జ్యోతి:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పాల్వంచ వైద్య ఆరోగ్య శాఖ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంగా ఉన్న జిల్లాలో ప్రజలకు నాణ్యమైన , అందుబాటులో ఉన్న వైద్య సేవలను అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు, ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడం అత్యంత కీలకమని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ నమ్మకాన్ని నిలబెట్టడం ప్రతి అధికారి, సిబ్బందిపై ఉన్న బాధ్యతగా తెలిపారు.ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 6 నుండి 11వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇతర జిల్లాలతో పోలిస్తే ఈ జిల్లాలో ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు ఉన్న నమ్మకం విశేషమని తెలిపారు .క్షేత్రస్థాయిలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రాష్ట్ర స్థాయి అవార్డులను స్వీకరించేందుకు హైదరాబాద్‌లోని వీంద్ర భారతికి వెళ్లినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయితో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కూడా అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి తుకారాం రాథోడ్ మాట్లాడుతూ, జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు , ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 43 మంది ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దారు దారా ప్రసాద్,డిప్యూటీ డి ఎం హెచ్ ఓ ప్రసాద్ నాయక్, డాక్టర్ స్పందన, డాక్టర్ తేజస్వి,వైద్య శాఖ సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తాసిల్దార్ ను బదిలీచెయ్యండి

- **జిఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ**



**చర్ల, ఏప్రిల్ 07:(ప్రజా జ్యోతి ):** చర్ల తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావును తక్షణమే అక్కడి నుండి బదిలీ చేయాలని మొన్న జరిగిన తాసిల్దారుల బదిలీల్లో చర్ల తాసిల్దార్ ను కూడా జిల్లా కలెక్టర్ బదిలీ చేసి ఉంటే బాగుండేదని ప్రజలు అనుకున్నారని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ అభిప్రాయం వ్యక్తం చేశారు.షెడ్యూల్ ప్రాంతమైన చర్లలో అనేక అక్రమాలు గ్రావెల్ మట్టి ఇసుక అలాగే ఎల్ టి ఆర్ 1/70 చట్ట వ్యతిరేకంగా ప్రభుత్వ భూములలో అక్రమాలు జరుగుతున్నాయని మండల మేజిస్ట్రేట్ కు ఆదివాసి సంఘాలు ఫిర్యాదు చేస్తే ఒకటి వినండి అనే పదం తో మొదలు పెట్టి ఇచ్చిన ఫిర్యాదులు నెలలు గడుస్తున్న అవి ఏమాత్రం పరిష్కారం కావడం లేదని తాసిల్దార్ కళ్ళముందే షెడ్యూల్ చట్ట ఉల్లంఘన జరుగుతూ ఉంటే నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటూ ప్రజలకు గాని ప్రజా సంఘాలకు ఏమాత్రం జవాబుదారితనం లేనందున తక్షణమే బదిలీ చేసి పనిచేసే తాసిల్దార్ ను నియమించాలని గతంలో పనిచేసిన తాసిల్దార్ వీరెల్లి నాగేశ్వరరావు రిటైర్డ్ వారు పనిచేసిన కాలంలో ఇసుక మాఫియా గ్రావెల్ మాఫియా ఇలా అనేక జీరో దందా కార్యక్రమాలపై ఉక్కు పాదం మోపారని ప్రస్తుత తాసిల్దార్ కాలంలో రాత్రి పగలు తేడా లేకుండా అనేక అక్రమాలు లారీలు ట్రాక్టర్లు తో జరుగుతున్నాయని ఒకవేళ ఫిర్యాదు చేస్తే ఫిర్యాదు ఏ మాత్రం పట్టించుకోకుండా అసలు ఏజెన్సీ ప్రాంతామే కాదనే భ్రమలో ఉన్నారని అలాంటి అధికారి ఈ ప్రాంతంలో విధులు నిర్వహించవలసిన అవసరం లేదని అన్నారు.జిల్లా కలెక్టర్ కూడా షెడ్యూల్ ప్రాంతంలో పనిచేస్తున్న తాసిల్దారులకు చట్టాల అమలుకు దిశ నిర్దేశించడం చాలా అవసరమని ఏజెన్సీలో గిరిజన చట్టాలు మొత్తం రెవిన్యూ పంచాయతీ సెక్రెటరీల కను సన్నలోనే నిర్వీర్యం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.షెడ్యూల్ ఏరియా అని రికార్డులో మాత్రమే తప్ప ఐఏఎస్ ఆఫీసర్ నుండి తాసిల్దారు వరకు ఏమాత్రం గిరిజన చట్టాలను పరిగణలోకి తీసుకోవడం లేదని విమర్శించారు.

## డ్రైనేజ్ సమస్యకు పరిష్కారం

- **ప్రజలకు అండగా కార్పొరేటర్ నరేష్**



**పాల్వంచ, ఏప్రిల్ 7, ప్రజాజ్యోతి:** పాల్వంచ 45వ డివిజన్ పరిధిలోని ఒడ్డుగూడెంలో తీవ్రంగా నిలిచిపోయిన డ్రైనేజ్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజ్ జామ్ కావడంతో ఇండ్లలో వాడే మురుగునీరు రోడ్డుపైకి వచ్చి, తిరిగి నివాస గృహాల్లోకి చేరుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో స్థానికులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు.ప్రజల అభ్యర్థన మేరకు వెంటనే స్పందించిన కార్పొరేటర్ నరేష్, కాంట్రాక్టర్ కొండలు కలిసి సమస్య పరిష్కారానికి మరమ్మత్తు పనులు ప్రారంభించారు. డ్రైనేజ్ లైన్లను శుభ్రపరచడం, జామ్ తొలగించడం వంటి పనులు వేగంగా కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా కార్పొరేటర్ నరేష్ మాట్లాడుతూ, డివిజన్‌లో ఎలాంటి సమస్య ఉన్నా ప్రజలు తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటూ సేవ చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని ఆయన స్పష్టం చేశారు.స్థానికులు సమస్యపై వెంటనే స్పందించి చర్యలు తీసుకున్నందుకు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- **సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య**



**ములకలపల్లి, ఏప్రిల్ 07, ప్రజాజ్యోతి:** ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఆరబోసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డ్వాక్రా గ్రూపులకు అప్పగించే ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వరి కోతలు పూర్తిచేసి పంటను ఆరబోసి రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం సరికాదని ఆక్షేపించారు. మాదారం కొనుగోలు కేంద్రాలను డ్వాక్రా గ్రూపులకు ఇవ్వకుండా ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోతుందనే భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.కొనుగోలు చేసిన పంటకు వారం రోజుల్లోనే బోనస్ రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోతే రైతులను పెద్ద ఎత్తున సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, నాయకులు ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, రైతులు ఊకంటి చిట్టిబాబు, ఊకంటి కిషోర్, కందుకూరి లక్ష్మణ్, సావిత్రి, మంగమ్మ, చిట్టెమ్మ, రంగమ్మ, సుశీల, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు

## ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- **ప్రపంచ ఆరోగ్యదినోత్సవ ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్ఓ తుకారాం రాథోడ్**




**బూర్గంపహాడ్, ఏప్రిల్ 7 (ప్రజా జ్యోతి ):** మానవ జీవితంలో ప్రతిఒక్కరికీ ఆరోగ్యంపై శ్రద్ధ ఉండాలని...ఆరోగ్యంపై శ్రద్ధ చూపినప్పుడే జీవితం సాఫీగా సాగుతుందని డీఎంహెచ్ఓ తుకారాం రాథోడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్ లో ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మోరంపల్లిబంజర్ పీహెచ్సీ సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కేజీబీవీ పాఠశాల ప్రాంగణం నుంచి ప్రారంభమై బస్టాండ్ వరకు సాగింది. అనంతరం కేజీబీవీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బందికి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. ఆరోగ్య ప్రాముఖ్యత కోసం విద్యార్థులు తీసుకోవాల్సిన, పాటించాల్సిన అంశాలను వివరించారు. తొలుత పీహెచ్సీలో రికార్డులు పరిశీలించి ఆశా లు, ఆరోగ్య సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఆశాలు, ఆరోగ్య సిబ్బందికి సమావే శం నిర్వహించి గర్భిణీ మహిళల నమోదు, అధిక ప్రమాద గర్భధారణల గు ర్తింపు, నిర్వహణ ప్రారంభదశలో ఏఎన్సీ నమోదు మెరుగుదలపై అవగాహన క ల్పించారు. రోగుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారికి అందుతున్న వైద్యంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం భద్రాచలంలో జరిగే ఏడు ఉపకేంద్రాల ఆశా కార్యకర్తల దినోత్సవ కార్యక్రమానికి డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీధర్ తో కలిసి వెళ్లా రు. ఎంపీ బంజర్ వైద్యులు నవీన్, డీపీఎంవో మోహన్, ఎంపీ హెచ్ఐవో రవి, ఏఎన్ఎంలు, సూపర్వైజర్లు, ఆశాలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాద నివారణకు చర్యలు

- **గట్టు గూడెం వద్ద ప్రమాదకర వృక్షం తొలగింపు**

**దమ్మపేట, ఏప్రిల్ 07, (ప్రజాజ్యోతి ):** దమ్మపేట పోలీసుల ఆధ్వర్యంలో, నేషనల్ హైవే అధికారుల సహకారంతో గట్టు గూడెం గ్రామ శివారులో రహదారి భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న మూలమలుపు వద్ద ఉన్న భారీ వృక్షాన్ని తొలగించి, ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.ఈ చర్యల వల్ల ఆ ప్రాంతంలో ప్రమాదాల అవకాశాలు తగ్గుతాయని అధికారులు తెలిపారు. అలాగే వచ్చే వారం రోజుల్లో నేషనల్ హైవే అధికారుల సహకారంతో గట్టు గూడెం క్రాస్ రోడ్ నుండి మందలపల్లి క్రాస్ రోడ్ వరకు రహదారి ఇరువైపులా పెరిగిన పొదలను తొలగించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రమాదాల నివారణ కోసం అవసరమైన సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ చర్యలతో ప్రయాణికుల భద్రత మెరుగుపడుతుందని దమ్మపేట ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి తెలిపారు.



# సభను నీరుగార్చింది ఆ ఇద్దరే..!?

(మొదటి పేజీ తరువాయి...)

అసలు లక్ష్యానికి దూరమైందని పాల్గొన్నవారు ఆరోపిస్తున్నారు. కన్వీనర్ ఉన్నప్పటికీ ఆ బాధ్యతలను పక్కన పెట్టి కార్యక్రమం ప్రారంభంలోనే ఆ ఇద్దరు మైక్ తీసుకుని జోక్యం చేసుకోవడం వల్ల వేదికపై గందరగోళం నెలకొన్నట్లు చెబుతున్నారు. జరిగిన కార్యక్రమం లో ఎవరు మాట్లాడాలి, ఎవరు ఎక్కడ కూర్చోవాలి, ఎవరిని వేదికపైకి అనుమతించాలి అనే విషయాల్లో కూడా వారే అధికారం చలాయించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో మహనీయుడిని స్మరించుకునే గౌరవప్రదమైన కార్యక్రమం రాజకీయ వేదికగా మారిందని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జరిగిన కార్యక్రమంలో ఆ ఇద్దరి పాత్ర ఏమిటని ప్రశ్నించిన వారిపై అసహనంగా స్పందిస్తూ బూతుల వర్షం కురిపించడమే కాకుండా దాడులకు సిద్ధమా? అన్నట్లుగా రెచ్చగొట్టే ధోరణి ప్రదర్శించారని బాధితులు ఆరోపిస్తున్నారు. కన్వీనర్ ఉన్నప్పుడు ఇంకొకరు ఎందుకు బాధ్యతలు తీసుకోవాలి? అని పలువురు దళిత వర్గాల సభ్యులు ప్రశ్నిస్తున్నారు. సభను విజయవంతం చేయడంలో సహకరించాల్సిన వారు వ్యక్తిగత ప్రాధాన్యం కోసం వ్యవహరించడంతో కార్యక్రమం నీరుగారిపోయిందని ఆవేదన వ్యక్తమవుతోంది.

### ››› ఇదెక్కడి బాగోతం..?

మహనీయుడి జయంతి పేరుతో సభ నిర్వహించి, అదే వేదికపై వ్యక్తిగత ఆధిపత్య పోరాటం సాగించడం పట్ల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన వారు వ్యక్తిగత ప్రదర్శనలకు దిగడం సిగ్గుచేటని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకపై ఇలాంటి కార్యక్రమాలు నిజంగా మహనీయుల గౌరవార్థమే జరుగుతాయా? లేక కొందరి ఆధిపత్యానికి వేదికలుగా మారిపోతాయా? అన్న ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి.

### ››› ఉన్నదంటే ఉలుకే ఎక్కువ..!

కార్యక్రమంలో ఆ ఇద్దరి పాత్రపై ప్రశ్నించిన వారిపై తీవ్ర ఆగ్రహంతో స్పందిస్తూ బెదిరింపులకు దిగారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఆ ఇద్దరికీ రాజకీయ అండదండలు పుష్కలంగా ఉండటం తో ప్రశ్నించిన వారితో దాడులకు సిద్ధమా? అన్నట్లుగా మాట్లాడటం వారి అహంకారానికి నిదర్శనం అంటూ పేర్కొంటున్నారు. మహనీయుడి జయంతి వంటి కార్యక్రమం అందరూ కలిసికట్టుగా నిర్వహించాల్సిన వేడుకలో కొందరు వ్యక్తిగత రాజకీయ ప్రతిష్ట కోసం వేదికను ఉపయోగించుకోవడం సరైంది కాదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సభను ఉద్దేశించి మహనీయుడి చరిత్ర గురించి మాట్లాడటం తెలియని వ్యక్తులు అని ఉన్నదంటే ఉలుకే ఎక్కువ అన్నట్లుగా ఆ ఇద్దరి వ్యవహారం కనిపించిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

### ››› మినీ బ్యాంక్ నిర్వాహకుడి నోటి దురుసుపై తీవ్ర విమర్శలు

కొత్తగూడెం సమీపంలోని మినీ బ్యాంక్ నిర్వహిస్తున్న వ్యక్తి ప్రవర్తనపై కూడా స్థానికంగా తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి హోదా కలిగిన వ్యక్తి ప్రజాస్వామ్య విలువలను పక్కన పెట్టి ప్రశ్నించిన వారి పట్ల నోటి దురుసుతో అసభ్య పదాలు తో విరుచుకుపడటం సరికాదని బాధితులు హెచ్చరిస్తున్నారు. ఆ వ్యక్తి ప్రవర్తన సక్రమంగా ఉండదని ఇప్పటికే విమర్శలు వినిపిస్తున్నాయి. బ్యాంక్ సేవలు అందించాల్సిన వ్యక్తి అందరినీ సమానంగా చూడాల్సిన బాధ్యత కలిగి ఉండగా తనకు నచ్చిన వారికే రుణాలు అందించేలా సహకరిస్తూ మరికొంతమందిని అనవసరంగా తిరగబెట్టి... దగ్గర వాళ్లకే సాయం...మిగతావారికి నిరాకరణ అన్న విధంగా వ్యవహరిస్తున్నాడని విమర్శలు వినిపిస్తున్నాయి.

### ››› దళిత సంఘం నేతల ఆగ్రహం

ఈ ఘటనలపై దళిత సంఘం నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహనీయుడి పేరుతో నిర్వహించిన కార్యక్రమాన్ని కొందరు తమ ఆధిపత్య ప్రదర్శనగా మార్చేశారని మండిపడుతున్నారు. సభ విజయవంతం కావాలంటే కన్వీనర్‌కు సహకరించాలి గానీ బాధ్యతల్లో జోక్యం చేసుకుని వేదికను గందరగోళానికి గురి చేయడం సరైంది కాదని విమర్శిస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్పష్టమైన బాధ్యతలు కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఉత్తమ వైద్య సేవలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

- భద్రాద్రి కొత్తగూడెం టీవీవీపీ ఆసుపత్రులకు అత్యధిక అవార్డులు



**చర్ల, ఏప్రిల్ 07:(ప్రజా జ్యోతి ):** 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రకటించిన అవార్డుల్లో గిరిజన జిల్లా భద్రాద్రి కొత్తగూడెం విశిష్ట స్థానం సంపాదించింది. జిల్లా డీసీహెచ్ఎస్ డా. రవి బాబు పరిధిలోని వైద్య విధాన పరిషత్ (టి వి వి పీ ) ఆసుపత్రులు అత్యధిక అవార్డులు సాధించడం విశేషం. గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన, సమయోచిత వైద్య సేవలు అందించడంలో చూపిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా మంగళవారం అవార్డుల ప్రదానం హైదరాబాద్ లోని రవీంద్రభారతి లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శి శ్రీమతి క్రిస్టినా, కమిషనర్ ఫ్యామిలీ & హెల్త్ శ్రీమతి సంగీత, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్ , హైదరాబాద్ జిల్లా కలెక్టర్ మరియు ఆరోగ్య శాఖకు సంబంధించిన పలు విభాగాధిపతులు పాల్గొన్నారు. ఈ అవార్డులు అందుకున్న వారిలో భద్రాచలం, మణుగూరు , చర్ల వంటి గిరిజన ప్రాంతాల్లో ఉత్తమ సేవలు అందించినందుకు "బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇన్ ట్రైబల్ ఏరియా" విభాగంలో డీ సి హెచ్ ఎస్ డాక్టర్ జి రవి బాబు మూడు అవార్డులు ఆయా సూపరింటెండెంట్లు అయిన రామ కృష్ణ,గౌరీ ప్రసాద్, చర్ల సి హెచ్ సి డాక్టర్ సాయి వర్ధన్ లతో కలిసి అందుకున్నారు.జిల్లా టీవీవీపీ ఆసుపత్రులు ఇప్పటికే పలు సందర్భాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు పొందగా, ఈ అవార్డులు గిరిజన ప్రజలకు అందిస్తున్న ఉత్తమ వైద్య సేవలకు మరో గొప్ప గుర్తింపుగా నిలిచాయి.

## ఏప్రిల్ 10న లబ్ధిదారుల ఎంపిక

**ములకలపల్లి ఏప్రిల్ 07, ప్రజాజ్యోతి:** ఈ నెల 10వ తేదీన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎస్సీ కార్యాచరణ ప్రణాళిక 2025–26 పథకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల నుంచి లబ్ధిదారుల ఎంపిక నిర్వహించనున్నట్లు మంగళవారం ఎంపీడీవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ దరఖాస్తు జిరాక్స్ ప్రతితో పాటు అన్ని అసలు ధృవీకరణ పత్రాలను తీసుకుని శుక్రవారం ఉదయం 11.00 గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి రావాలని సూచించారు.

## సైబర్ నేరల పై అవగాహన



**టేకుల ప ల్లి, ఏ ప్రిల్0 7 , ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకన్న బాబు ఆధ్వర్యంలో చింతోని చెల్లక గ్రామ పంచాయతీ లో నాగారం గుత్తి కోయ గ్రామానికి చెందిన మాధవి సునీత కీ,కుంజం లక్ష్మి కీ సన్మానం చేశారు.ఈ సందర్భంగా డీఎస్పీ యూత్ నీ ఉద్దేశించి మాట్లాడుతూ మంచిగా చదువుకొని ఉన్నత స్థాయి కీ ఎదగాలీ అని చెడు మార్గాలలో వెళ్లకూడదు అని తెలియజేశారు.గ్రామాలలో ఉద్యోగం పొందిన వారిని మంచిగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఉన్న వారిని ఆదర్శంగా తీసుకోవాలి అనీ కోరారు. అదేవిదంగా సైబర్ నేరాల పై,ట్రాఫిక్ రూల్స్ పై, మాదక ద్రవ్యాల పై అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బోడు ఎస్ ఐ శ్రీనివాస్ రెడ్డి, చింతోని చెల్లక గ్రామ సర్పంచ్ ,సెక్రటరీ,మాజీ సర్పంచ్,ఉప సర్పంచ్,బోడు పోలీస్ సిబ్బందిపాల్గొన్నారు.

## రైతు హామీలు అమలు చేయాలి

- సిఐటియు డిమాండ్
- కొత్తగూడెం మహాసభలకు సిద్ధం కావాలి - పిట్టల అర్జున్



**దమ్మపేట, ఏప్రిల్ 07, (ప్రజా జ్యోతి):** రైతాంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. ఈ నెల 23 నుంచి కొత్తగూడెంలో జరగనున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.మహాసభల ప్రచారంలో భాగంగా మంగళవారం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో నెమలిపేట, అర్బన్ కాలనీలలో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ, దేశానికి అన్నం పెట్టే రైతులు నేడు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలకు కారణం ప్రభుత్వాల వ్యవసాయ విధానాలేనని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమైందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని అన్నారు.రైతు భరోసా నిధులు, రుణ మాఫీ, వడ్లకు సబ్సిడీ వంటి అంశాలు అ మలులో ఆలస్యం కావడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నా రు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభలకు అఖిల భారత నాయకులు హా జరవుతారని, తొలి రోజు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపా రు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు, రామకృష్ణ, ఈశ్వరమ్మ, సత్యవతి, విజయలక్ష్మి, యశోద, బుల్లెమ్మ పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రతి మండల కేంద్రంలో 200 గజాల భవన నిర్మాణం ఏర్పాటు చేయాలి



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 7,ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాయి బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ పట్టణానికి చెందిన పలువురు నాయిబ్రాహ్మణ సంఘ నాయకులు మంగళవారం తాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు, ఈ సందర్భంగా సంఘ గౌరవ అధ్యక్షులు కొంగర అప్పారావు మాట్లాడుతూ జిల్లా అధ్యక్షులు కడియాల సత్యనారాయణ ఆదేశాల మేరకు పలు సమస్యలు కూడిన వినతి పత్రాన్ని అందజేయడం జరిగిందన్నారు, ముఖ్యంగా నాయి బ్రాహ్మణులకు అనాదిగా వస్తున్న తమ వృత్తి పరిధిలోకి ఇతరులు రాకుండా పేషెంట్ హక్కు జీవో కల్పించాలని కోరారు, అదేవిధంగా ప్రతి మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణులకు 200 గజాల భవన నిర్మాణం నిర్మించి ఇవ్వాలని , ఫెడరేషన్ నిర్మించి దానికి అధ్యక్షులను నాయి బ్రాహ్మణ వర్గానికి చెందిన వారిని మాత్రమే నియమించాలన్నారు, తమ కులస్తులను కుల దూషణ పేరుతో దూషించిన వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు, ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ ఫలాలను నాయి బ్రాహ్మణ కులస్తులకు అందించాలన్నారు, ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కొదురుపాక శ్రీరాములు, కుదురుపాక వెంకటేశ్వర్లు, గజ్జెల నరసింహారావు, జిడుగు శ్రీనివాసరావు, తూముల ఏడుకొండలు, వద్దుల రమేష్, మునుగు నూరి శ్రీనివాస్, జంపాల సాయి, గజ్జి ల నాగేందర్, గజ్జెల కిరణ్, వెల్లంకి కృష్ణ, ధూళిపాళ్ల మహేష్, అఖిలేష్, సైదులు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు

## నూతన రేషన్ షాప్ ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

**టేకులపల్లి,ఏప్రిల్ 07,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం బిల్లుడుతండా గ్రామంలో నూతనంగారేషన్ షాపును ఎమ్మెల్యే కోరం కనకయ్య రిబ్బెన్ కట్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వంలో ప్రతీ పేదవాళ్లకు సి యం రేవంత్ రెడ్డి అండగా ఉంటూ తెలంగాణ ప్రజలకు మంచి పరిపాలన అందిస్తున్నారని అన్నారు. ప్రతీ పేదవాడు కూడా సన్న బియ్యం తినాలి అనే ఆలోచనతో రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. నేడు ఉన్నోడు,లేనోడు అనే తేడా లేకుండా పేద కుటుంబాలు సైతం సన్నబియ్యం అన్నం తినేలా వారి మనస్సులో పేదవాళ్ళు అనే భావం లేకుండా సంతోషాన్ని నింపుతున్నారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

